క్లుప్తంగా

డిండి సీఐగా సురేష్


ఎస్. సురేష్

డిండి : డిండి రూరల్ సీఐగా ఎస్ సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన పరుశురాం రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ కావడంతో నల్లగొండ ఐజీ కార్యాలయం నుంచి ఎస్. సురేశ్ డిండి సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రల పరిరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

చింతపల్లి : ఓ మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి ఏడేళ్ల కారాగార జైలు శిక్ష విధిస్తూ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి తిరుపతి తీర్పును వెలువరించినట్లు చింతపల్లి ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. 2022సంవత్సరంలో సెప్టెంబర్ నెలలో చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామానికి చెందిన ఓ మహిళపై మాల్‌కు చెందిన బెల్రామ్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడడంతో అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించిన న్యాయమూర్తి ఏడేళ్ల కారాగార శిక్ష విధించినట్లు చింతపల్లి ఎస్ఐ డి.సతీష్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు ఎన్నిక


గడ్డం వెంకటయ్య


పాలగోని వెంకట్‌గౌడ్

చందంపేట : కాంగ్రెస్ పార్టీ నేరెడుగొమ్ము, చందంపేట మండలాల బీసీ సెల్ మండల అధ్యక్షులుగా గడ్డం వెంకటయ్య, పాలగోని వెంకట్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

23న మండల సర్వసభ్య సమావేశం

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23న ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దండ జితేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలంతా సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సైదులు

గుర్రంపోడు : ఎమ్మార్పీఎస్ మండల అడహక్ కమిటీ అధ్యక్షుడిగా తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన మేడి సైదులును గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ పోలేని యాదయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మేడి వెంకన్న, కోటేష్,, శేఖర్, కిరణ్, నాగరాజు, సైదులు, యాదయ్య పాల్గొన్నారు.

బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బడాయిగడ్డ గ్రామానికి చెందిన తురక ఏడుకొండలు గురువారం మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులకు, బంధువులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎవరైన మరణించిట్లయితే ఆ కుటుంబానికి, బంధువులకు బుసిరెడ్డి ఫౌండేషన్ అక్కడికి వెళ్లి అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎరవైన చనిపోయినట్లయితే బంధువులకు ఆ రోజు అన్నదానం చేయడానికి 9346534535 సంప్రదించాలని తెలిపారు.

ప్రతిరోజూ యోగా సాధన చేయాలి

నల్లగొండ రూరల్ : ప్రతిరోజూ యోగా సాధన చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్లు లలిత, సుజాత అన్నారు. గురువారం చర్లపల్లిలోని డీవీఎం కాలేజీలో ఎంఈడీ మొదటి ఏడాది విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక, మానసిక ప్రశాతంత ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌రావు, నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వడిపల్లి రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీధర్, కన్నయ్య, సత్యనారాయణ, సరిత, నాగయ్య, వెంకటేశ్వర్లు, విజయ్‌లక్ష్మి, వీరప్ప ఉన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా..!

- మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- మన ఊరు –మన బడి పథకంతో మెరుగైన వసతులు


మన ఊరు మన బడి పనులు పూర్తయిన కాల్వపల్లి ప్రాథమిక పాఠశాల


పిట్టలగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థులు

గుర్రంపోడు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'మన ఊరు మన బడి' పథకంతో పాఠశాలలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో రూపురేఖలు దిద్దుకుంటున్నాయి. మండలంలోని 63 పాఠశాలలకుగాను మొదటిదశలో 21 పాఠశాలలను మన ఊరు మనబడి పథకం మొదటి దశ క్రింద ఎంపిక చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలకు అవసరమై అన్ని రకాల పనులు పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మాణం మేరకు సరిపడా నిధులు మంజూరు చేశారు. ఆయా పాఠశాలల్లో శాశ్వత నిర్మాణాలుగాని, ఇతర మరమ్మత్తులు కాని సమీప భవిష్యత్‌లో కూడా అవసరం పడే అవకాశమే లేకుండా పూర్తిస్థాయిలో పక్కాగా పనులు గుర్తించి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సివిల్ పనులు పాఠశాల యాజమాన్య కమిటీలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరుగుతుండగా డెస్క్ బెంచీలు, స్మార్ట్ టీవీలు, గ్రీన్ చాక్‌బోర్డులాంటివి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో టెండర్ల ద్వారా కొనుగోలు చేసి నేరుగా ఆయా పాఠశాలలకు సరఫరా చేయనున్నారు.

రెండున్నర కోట్లతో పనులు

మండలంలోని పోచంపల్లి, చామలేడు, పిట్టలగూడెం, కట్టవారిగూడెం, కొప్పోలు, నడికూడ, మోపూరిగూడెం, తేనపల్లి, పాల్వాయి, మక్కపల్లి, కాచారం, చేపూరు, వడ్డరిగూడెం, ప్రాథమిక పాఠశాలలు, తానేదార్‌పల్లి, మొసంగి ప్రాథమికోన్నత పాఠశాలలు, జెడ్పీహెచ్‌ఎస్ గుర్రంపోడు, జెడ్పీహెచ్‌ఎస్ పిట్టలగూడెం, జెడ్పీహెచ్‌ఎస్ పాల్వాయి పాఠశాలల్లో పనులు చురుకుగా సాగుతుండగా మునీంఖాన్ గూడెం, కాల్వపల్లి ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తి చేసి గత నెలలోనే ప్రారంభించారు. మండలంలో ×మన ఊరు మన బడి¥ పనులు 50 శాతం పూర్తయినాయి. నిధుల కొరత లేనందున పనులు త్వరిగతిన పూర్తి చేయాలని కంట్రాక్టర్లపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. పాఠశాలల్లో బోరు, మోటారు, ట్యాంకు, మిషన్ భగీరథ నీటి నిల్వకు సంపు, విద్యుత్, కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్, అదనపు గదులు, శిథిలావస్థలో ఉన్నవాటిని తొలగించి నూతనంగా గదులు, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు, మంచినీటి కుళాయిలు తదితర సౌకర్యాలు అన్నీ సమకూర్చడంతోపాటు తలుపులు, కిటికీలు అవసరమైన అన్ని రకాల మరమ్మతులు చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది



'మన ఊరు మన బడి' పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని రకాల వసతులు సమకూర్చనున్నారు. పాఠశాలల రూపురేఖలు మారి సరికొత్త శోభను సంతరించుకుంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను తమ ఊరి ప్రభుత్వ బడిలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. దశల వారీగా అన్ని పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకం అమలు చేయనున్నారు.

– తరి రాము మండల విద్యాధికారి

కాంగ్రెస్ వాగ్దానాలను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు, రైతులు మోసపోవద్దని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప, కొత్తగూడెం గ్రామాల్లోని రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయానికి 3గంటల విద్యుత్ సరిపోతుందని మాట్లాడిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వచ్చే ఎన్నికల సందర్భంలో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రాష్ట్రంలో చిమ్మ చీకట్లు తప్పవని, అదే బీఆర్‌ఎస్‌ను నమ్ముకుంటే రాష్ట్రం వెలుగుతూ ఉంటుందన్నారు. 3గంటల విద్యుత్‌ను ఇస్తామన్న కాంగ్రెస్‌ను నమ్ముతారా, 24గంటల ఉచిత్ విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను నమ్ముతారా అన్నారు. రైతుల సంక్షేమానికి దేశంలో ఏ ముఖ్యంత్రి చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని రైతుల కోసం సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని, అటువంటి ముఖ్యమంత్రికి రైతులందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, నాయకులు ప్రసాద్, చిలుక విద్యాసాగర్, భిక్షనాయక్, కట్టిబోయిన పాపారావు, పులి జగదీష్, పూసపాటి రాజయ్య, జెట్టి లింగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మంచానాయక్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నాగార్జునసాగర్ : 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీనుండి 27వతేదీ వరకు దరఖాస్తులు పైలాన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 28వతేదీన సర్టిఫికెట్స్, జీరాక్స్ కాపీలతో హాజరైతే అడ్మిషన్లు ఇస్తామని తెలిపారు.

రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


చందంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామ రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. రైతు బంధు, రైతు బీమా, సాగునీటిని అందిస్తుండడంతో సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, టీవీఎన్.రెడ్డి, శ్రీను, రాజు, ఉత్తరమ్మ, పల్స కాటంగౌడ్, గిరిప్రసాద్, పార్వతయ్య, బొడ్డుపల్లి కృష్ణ, చాట్ల రాములు, గోని సత్యనారాయణ, నోముల యాదయ్య, ఎరుకల లక్ష్మినారాయణ, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని సాయి బాబా దేవాలయంలో నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని గరుడాద్రి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.6కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, నాయకులు సురేష్‌గౌడ్, చింతపల్లి సుభాష్, టీవీఎన్.రెడ్డి, ఇలెందు శ్రావణ్, సుధాకర్, పానుగంటి మల్లయ్య, నీలా పాండరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చందంపేట : రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు వారసుడని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం రైతులకు ఉచిత కరెంటుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చందంపేట మండలంలోని పోలేపల్లి రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, రమావత్ మోహన్ కృష్ణ, గోసుల అనంతగిరి, కేతావత్ లక్ష్మణ్ నాయక్, కేతావత్ శంకర్‌నాయక్,ముత్యాల రవి, జక్కుల మున్నయ్య, రవి, నాగార్జు, అర్జున్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలి


నిడమనూరులో శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్


హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి లీలా


మిర్యాలగూడ : మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, బీఎల్‌ఓ ఆప్ తదితర విషయాలపై బీఎల్‌ఓలకు, సూపర్‌వైజర్స్‌కు శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చెన్న య్య పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయకుండా ఉండడం అనేది రాజ్యాంగ విరుద్ధమని, అందుకు స్పెషల్ సమ్మరి రివిజన్–2ను ఏర్పాటు చేసి బీఎల్‌ఓలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. ఫాం–6,7,8లకు సంబంధించిన ఓటర్ల నమోదుపై అవగాహన ఏర్పరుచుకోని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీలాల్దార్ గణేష్, ఎస్ఎల్ఎంటీ బాలు, డీఎల్ఎంటీలు కోటయ్య, రాజు, రామచంద్రు, జనార్దన్, సైదిరెడ్డి, సిబ్బంది సతీష్‌కుమార్, కళ్యాణ్, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులపై జాగ్రత్తలు పాటించాలి

నిడమనూరు : ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే. శ్రీనివాస్ అన్నారు. నిడమనూరు మోడల్ స్కూల్‌లో గురువారం బీఎల్‌ఓలు, సూపర్ వైజర్‌లకు బీఎల్‌ఓ యాప్, ఓటరు జాబితా మార్పు, చేర్పులు, తొలగింపు, విచారణ నివేదికల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వి. లీల, తహసీల్దార్ ప్రమీల, డీటీ హరికృష్ణ, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

హాలియా : తప్పులు లేని ఓటరు లిస్టు రూపొందించాలని రిటర్నింగ్ ఆఫీసర్ లీలా సూచించారు. హాలియా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మండలంలోని బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో ఓటరు జాబితా నమోదుపై ఒక్కరోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ల విధులు, బాధ్యతలు, ఓటరు లిస్టు తయారీపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని దీనిపై బీఎల్‌ఓలు దృష్టి సారించాలన్నారు. అనంతరం ఓటరు నమోదు ప్రక్రియ, పేర్లు మార్పులు, చేర్పులు, సవరణ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సదుపాయాలను అధికారులకు తెలపాలన్నారు. ఫారం 6,7,8 బీఎల్‌ఓ యాప్‌పై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగ, డీటీ రామకృష్ణ, ఆర్ఐ శంకర్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్స్ మధు, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, పరుశురాం, టీచర్లు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని మండల తహసీల్దార్ దేశ్యానాయక్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు అంబటి శ్రీను, రాయికింది సైదులు, వెంకట్‌రెడ్డి, ఆర్ఐ ఠాకూర్ రామకృష్ణ, కోటేశ్వరీ, నాగమణి, అరుణ్ తదితరులున్నారు.

పట్టణ అధ్యక్షుడిగా మురళి యాదవ్


నియామకపత్రం అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

మిర్యాలగూడ టౌన్ : బీసీ యువజన సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులుగా మురళి యాదవ్‌ను నియమిస్తూ గురువారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుఆర్. కృష్ణయ్య నియా మక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళి యాదవ్ మాట్లాడారు. తన నియామనికి అన్ని విధాలుగా సహకరించిన జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, తిరుమలగిరి అశోక్, శ్రీనివాస్, జిలపల్లి అంజి, అనంతరయ్య, నర్సింహ్మలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

టీ–9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి


కండక్టర్ హైమాను సత్కరిస్తున్న డిప్యూటీ ఆర్ఎం శివశంకర్, డీఎం పాల్

మిర్యాలగూడ టౌన్ : ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టీ9 టికెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డిప్యూటీ ఆర్ఎం శివ శంకర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ అమలు చేసిన టీ 9 టికెట్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించిన కండక్టర్ హైమాను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీ 9 టికెట్ ద్వారా 60కిలో మీటర్ల వరకు ప్రయాణికులు రూ.100తో అప్ అండ్ డౌన్ ప్రయాణం చేయొచ్చన్నారు. డిపోలో జూన్ 18 నుంచి ప్రారంభమైన టీ 9 టికెట్ ఇప్పటి వరకు 1800 మంది ప్రయాణికులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. మిగతా ప్రయాణికులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, డిపోను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌పాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, జనార్దన్, నాగేశ్వర్‌రావు, రాజు, సురేష్, రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ నుంచి ఎర్రవరంకు బస్సులు

మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి కోదాడ మండలం ఎర్రవరంకు ప్రత్యేక బస్ సర్వీస్‌లను నడిపించనున్నట్లు డీఎం పాల్ తెలిపారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ డిపో నుంచి ఉదయం 6, 10 గంటలకు మధ్యాహ్నం 1:30, సాయంత్రం 5గంటలకు బస్సులు ఉంటాయన్నారు. ఎర్రవరంకు డిపో నుంచి పెద్ద వారికి రూ. 70, చిన్నపిల్లలకు రూ.50 రూపాయలు టిక్కెట్ ధర ఉంటుందన్నారు.

శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలి


వేములపల్లిలో ఈ మెయిల్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వేములపల్లి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మణిపూర్‌లో పర్యటించి అక్కడ శాంతిని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త 'కోటి ఈ మెయిల్ క్యాంపెయిన్'లో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఆ క్యాంపెయిన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాని శ్రీను, నాయకులు వడ్డెగాని సైదులు, వినయ్, సైదులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాలోతు దశరతనాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఆ సంఘం నాయకులు సైదానాయక్, మాన్యానాయక్, కృష్ణానాయక్, లింగానాయక్, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

మణిపూర్‌లో మహిళలను నగ్నం ఊరేగించి హత్య చేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మణిపూర్‌లో పట్టపగలే కూకి తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడి ఇద్దరు మహిళలను హత్య చేసిన శిక్షించాలన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాపర్ల ఏర్పాటు


స్టాపర్‌ను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ రంజిత్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : మండల పరిధిలోని జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి స్టాపర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా స్టాపర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు. ఆయన వెంట నయాగర యజమాని జనార్దన్‌రెడ్డి, గుడిపల్లి పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రైతుల చేతిలో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు


తిరుమలగిరి రైతువేదికలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రైతులుకు మూడు గంటలు కరెంట్ ఇస్తానన్న కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సంపత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తిరుమలగిరి, కొంపల్లి రైతు వేదికలలో రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి రైతులకు గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికి అదే పనిచేస్తుందన్నారు. గతంలో పరిపాలించిన జానారెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం ఆగయ్య, ప్రధాన కార్యదర్శి పోతుగంటి తిరుమల్, దేవస్థాన చైర్మన్ నాగేండ్ల వెంకట్‌రెడ్డి, కేతావత్ భిక్షానాయక్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కైకాబిక్షా నాయక్, నాయకులు ఆవుల నాసర్‌రెడ్డి, బాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జంగాల లక్ష్మమ్మ, శాగం కోటిరెడ్డి, నహీంపాషా తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హాలియా : హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సబ్జెక్టుల్లో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఫిరంగి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా డిగ్రీ కళాశాలలో తెలుగు–1, ఆంగ్లం 1, కామర్స్–1, కంప్యూటర్ సైన్స్ లేదా కంప్యూటర్ అప్లికేషన్–1, పొలిటికల్ సైన్స్–1, బోటని–1, జువాలజీ–1తో కలిపి మొత్తం 7పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారితో పాటు బోధనానుభవం వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా కళాశాలలో నేరుగా దరఖాస్తుల సమర్పించాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


దామరచర్లలో వర్షంలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

మిర్యాలగూడ : సమస్యలను పరిష్కరించాలని దామరచర్ల మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు గురువారం కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, సైదులు, కృష్ణారెడ్డి, నాగయ్య, జోలమ్మ, ఆర్‌కె.నాయుడు, కొండలు పాల్గొన్నారు.

చింతపల్లి : గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారంతో 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వర్షంలోనూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మాడ్గుల సైదులు, యాదయ్య, లింగమ్మ, శాంతమ్మ, యాదమ్మ, కృష్ణమ్మ, రాములమ్మ, భాగ్యమ్మ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం 15వ రోజు కొనసాగింది. స్థానిక చౌరస్తా వద్ద గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు యజ్ఞ నారాయణ, కార్మికులు కోట్ల సతీష్, బి.ప్రవీణ్, గుండాల వెంకటయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఐద్వా మద్దతు

గుర్రంపోడు : మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు ఐద్వా నల్లగొండ కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి వనమాల కామేశ్వర్, సీఐటీయూ నాయకులు పగిడిమర్రి సర్వయ్య, అంజనేయులు, యాదయ్య, వెంకటమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


మిర్యాలగూడ : అరెస్టయిన బీజేపీ నాయకులు


చింతపల్లిలో

సాక్షి నెట్ వర్క్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం 'చలో బాట సింగారం' కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేసి అదుపులో తీసుకున్నారుక. కొండమల్లేపల్లి, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్), అడవిదేవులపల్లి, చందంపేట, మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఆ కార్యక్రమానికి వెళ్లకుండా తెల్లవారు జామునే అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మాడుగులపల్లి : మండలంలోని అర్హులైన రైతులందరూ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సైదానాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జీరాక్స్‌లను జత చేసి మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో, వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. ఆగస్టు 5 వరకు దరఖాస్తు గడువు ఉందని, అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.